## రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత సాధించిన దమ్మపేట విద్యార్థిని

### శుభాకాంక్షలు తెలియజేస్తున్న పట్టణవాసులు




**దమ్మపేట, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

దమ్మపేట మండల కేంద్రానికి చెందిన దారా చంద్రశేఖర్ హారిక దంపతుల రెండవ కుమార్తె అయినటువంటి చైత్ర ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో రెండవ స్థానం సాధించడం పట్ల మండల మరియు పట్టణ ప్రముఖులు దారా చంద్రశేఖర్ కుటుంబానికి ప్రశంసలు తెలియజేస్తున్నారు. హైదరాబాదులోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న చైత్ర ఆదివారం విడుదల చేసిన మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు సాధించడం పట్ల చైత్ర యొక్క తల్లిదండ్రులు ఎంతో ఆనందానికి లోనయ్యారు. ఈ విషయం గురించి చైత్ర తండ్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ నా బిడ్డ లాగే ప్రతి ఒక్కరు మన రాష్ట్రానికి ఎంతో మంచి కీర్తి తేవాలని ఆయన ఆకాంక్షించారు. చైత్ర సాధించిన విజయం పట్ల మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య విద్యార్థిని అయిన చైత్రకు స్థానిక ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షులు పసుమర్తి రామభద్రం, పట్టణ అధ్యక్షులు ధారా ప్రసాద్, ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జున్ రావు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కక్కిరాల రమేష్, దమ్మపేట మండల జనసేన అధ్యక్షులు షేక్ రెహమాన్, మాజీ ఉప సర్పంచ్ ధారా యుగంధర్, మండల సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వర రావు, దారా కిషోర్, భవిరిశెట్టి రాము తదితర పుర ప్రముఖులు చైత్రకు, ఆమె కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాస్ లైన్ (ప్రజాపంద) పార్టీ నుండి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలో చేరికలు



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

సిపిఐ ఎంఎల్ (ప్రజాపంద) మాస్ లైన్ పార్టీ నుండి ఆ పార్టీ ఇల్లందు డివిజన్ నాయకులు బొర్ర వెంకన్న ఆదివారం గుండాల మండల కేంద్రంలో మాతృ సంస్థ అయిన న్యూ డెమోక్రసీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గుండాల మండల కేంద్రంలో పూనెం రంగన్న అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు బొర్ర వెంకన్నకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇల్లందు పార్టీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలంటే కమ్యూనిస్టులు, విప్లవకారులు ఒకే జెండాతో ఒకే పార్టీగా కొనసాగాల్సిన అవసరం ఎంతగానో ఉందని అన్నారు. ముఖ్యంగా గుండాల మండలం కమ్యూనిస్టు విప్లవకారులకు కంచుకోట, ఇలాంటి ప్రాంతంలో విప్లవకారులు విడివిడిగా ఉండాల్సిన అవసరం లేదని విప్లవకారులు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ ప్రాంతంలో న్యూ డెమోక్రసీ పార్టీ పేద ప్రజల తరపున అనేక పోరాటాలు నిర్వహించి ప్రజలకు అనేక హక్కులు సాధించి పెట్టిందని భవిష్యత్తులో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు, కాచనపల్లి సర్పంచ్ జర్పుల కిషన్, పర్శక రవి, యాసారపు వెంకన్న, బట్టు ప్రసాద్, బచ్చల సారన్న, ఈసం కృష్ణన్న, పెండ కట్ల పెంటన్న, మానాల ఉపేందర్, బానోతు లాలు, అటికం శేఖర్, ఎనగంటి లాజర్, ఈసం లక్ష్మీనారాయణ, పెండేకట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఒకేలా నమోదు చేయాలి

**– రైతు వేదికలో ప్రత్యేక నమోదు కార్యక్రమం**




**బూర్గంపహాడ్, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

ప్రభుత్వ పథకాలు, ఎరువుల కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి రైతులు తమ మొబైల్ నంబర్‌ను రైతు భరోసా, ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఎరువుల బుకింగ్ యాప్‌లలో ఒకేలా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఆర్. శంకర్ సూచించారు. మొబైల్ నంబర్లు వేర్వేరుగా ఉన్నా లేదా పాత నంబర్ అందుబాటులో లేకపోయినా వెంటనే సంబంధిత ఏఈఓ ను సంప్రదించి అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. లేకపోతే భవిష్యత్తులో ఎరువుల బుకింగ్ సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు 13-04-2026 ఉదయం 10:30 గంటలకు బూర్గంపాడు రైతు వేదికలో మొబైల్ నంబర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. ఈ ప్రక్రియకు చివరి తేదీ ఏప్రిల్ 20గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

## ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభంజనం

**బైపీసీలో టాప్ సారిక, ఎంపీసీలో టాప్ తేజ, ఎమ్ ఎల్ టి లో జ్యోతిర్మయి, సిటీ లో శ్రీలక్ష్మి టాప్**





**బూర్గంపహాడ్, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సైన్స్, ఆర్ట్స్, వొకేషనల్, లో సెకండ్ ఇయర్ 51 విద్యార్థులకు గాను 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 100 మంది విద్యార్థులు గాను 68 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిచారు ద్వితీయ సంవత్సరం 93 శాతం, ప్రథమ సంవత్సరం 68 శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగం నుండి మేడి తేజ 914/1000 మార్కులు, బైపీసీ నుండి సారిక 851/1000, ఎం ఎల్ టి నుండి జ్యోతిర్మయి 887/1000 సిటి లో శ్రీలక్ష్మి 872/1000, ప్రథమ సంవత్సరం నుండి సంజన ఎంపిసి 421/470 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన బ్రిలియంట్ విద్యార్థులు




**బూర్గంపహాడ్, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

నిన్న ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో స్థానిక సారపాక బ్రిలియంట్ కాలేజ్ నందు ఫస్ట్ ఇయర్ ఎంపిసి లో 470 మార్కుల కు గాను 466 మార్కులతో ఆర్.పావని స్టేట్ థర్డ్, 465 కె.బన్య శ్రీ స్టేట్ ఫోర్త్, 464 టి.భవ్య శ్రీ స్టేట్ ర్యాంకులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులుకు గాను బి.జాహ్నవి 982 మార్కులు సాధించి అందరిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత, గురు బ్రహ్మ అవార్డు గ్రహీత, నంది అవార్డు గ్రహీత, డాక్టర్ బి.ఎన్.ఆర్ మాట్లాడుతూ.. మన సారపాక లో స్టేట్ మార్కులు రావడం గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ గురు బ్రహ్మ అవార్డు గ్రహీత,నంది అవార్డు గ్రహీత, డాక్టర్ బి ఎన్ ఆర్ అధ్యాపకులు, విద్యార్థులని అభినందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్, మిఠాయిలు తినిపించారు.

## ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సత్తా చాటిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని

**సారపాక, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**



బూర్గంపాడు మండలం, తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీకి చెందిన గోవిందు యశ్విత నిన్న వెలువడిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో జయకేతనం ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మరియు తల్లిదండ్రులు గోవిందు వెంకటేశ్వర్లు, అనుష తమ కూతురికి కళాశాలలో మెరుగైన మార్కులు రావడంతో తమ సంతోషంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి


**– జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 12**

ఏప్రిల్ 13 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## పలు వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య




**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12** ఇల్లందు మాణిక్యారం గ్రామ సర్పంచ్ పూనెం స్వర్ణలత – సంతోష్ ల మరియు గడదాసు వెంకటమ్మ ల కుమార్తె నవిత–రాజా ల వివాహ వేడుకలకు ఎమ్మెల్యే హజరై పట్టు వస్త్రాలు సమర్పించి నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలలో వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్, పాయం స్వాతి, పూనెం సురేందర్, కాకటి భార్గవ్, సర్పంచులు మెచ్చా సాయమ్మ, తాటి యశోద, తాటి భిక్షం, అరెం కిరణ్, ఎట్టి హరిక్రిష్ణ, మూతి క్రిష్ణ, దండుగుల శివ, చెన్నూరి శ్రీనివాస్, జనగం కొటేశ్వరరావు, చెన్నూరి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాలపై సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడి

**– వంద క్వింటాళ్ల పైగా బియ్యం స్వాధీనం**



**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

ఇల్లందు సివిల్ సప్లై అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి పలు రేషన్ దుకాణాల్లో సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తూ రేషన్ దుకాణాల్లో స్టాక్ వివరాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు రేషన్ దుకాణాలను సమాచారం వరకు పట్టణంలోని సత్యనారాయణపురం, జిసిసి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సత్యనారాయణపురం లో రెండు ప్రదేశాల్లో 60 క్వింటాళ్ల పైగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన సమాచారం మేరకు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అదేవిధంగా జిసిసి కార్యాలయం ఎదురుగా మరో ఇంట్లో నిలువ ఉంచిన 40 క్వింటాల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు పట్టుకున్న రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహిస్తున్నారు. నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఎవరిది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ అక్రమ నిలవలపై దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లై డీటీలు మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి వర్ధంతికి నివాళులర్పించిన సీపీఎం శ్రేణులు




**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**

ఆదివాసీ ముద్దుబిడ్డ సిపిఎం పార్టీ నేత పేదల పెన్నిధి కుంజా బొజ్జి 5 వర్ధంతి సందర్భంగా ఇల్లందు ఏలూరి భవన్ లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి, పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ.. భద్రాచలం ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసి భద్రాద్రి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సంగతి అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. నాడు నక్సలైట్లు కూడా బోజ్జి ని నిర్బంధించి దాడి చేసినా ఆయన ప్రజల పక్షం నిలబడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, పూసల చంద్రు, శ్రీనివాస్, బుద్ధి లాల్ లోద్, సంతోషీ లోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో 430 మార్కులతో మెరిసిన ఎట్టి సంకీర్తన

**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 12**



ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో బోడుకొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని ఎట్టి సంకీర్తన అద్భుత ప్రతిభ కనబరిచింది. కొత్తగూడెం లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఆమె, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గానూ 430 మార్కులు సాధించి ఘన విజయం సాధించింది.?బోడు కొత్తగూడెం గ్రామానికి చెందిన కృష్ణ కుమార్తె అయిన సంకీర్తన, సాధారణ నేపథ్యం నుండి వచ్చి క్రమశిక్షణతో చదివి ఈ ఉత్తమ మార్కులు సాధించడం పట్ల అధ్యాపకులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంకీర్తన సాధించిన ఈ విజయం పట్ల కళాశాల సిబ్బంది స్పందిస్తూ..గిరిజన గురుకుల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా రాణిస్తున్నారని, సంకీర్తన ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తమ కుమార్తె సాధించిన ఈ ఫలితం పట్ల తండ్రి కృష్ణ మరియు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ తమను ప్రోత్సహించిన గురుకుల యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

